సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



కదం తొక్కిన కార్మికులు

ఉక్కు యాజమాన్యం తీరును నిరసిస్తూ.. స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు శనివారం ఉద్యమించారు. 8లో



మహిళా కానిస్టేబుళ్ల ప్రతిభ

ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్-2024 యోగా ఈవెంట్‌లో నగర పోలీస్ టీమ్ ప్రతిభ చూపింది. 8లో




రెక్కీ.. ఆపై చోరీలు

ఆలయాలను టార్గెట్ చేసి.. ఆధునిక టెక్నాలజీతో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో



• ధాన్యలక్ష్మిగా కనకమహాలక్ష్మి

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు శనివారం ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లడ్డూలతో పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. ఆదివారం ధైర్యలక్ష్మిగాదర్శనమివ్వనున్నారని, లక్ష తులసి పూజ నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శోభారాణి తెలిపారు. -డాబాగార్డెన్స్



• గాయత్రీదేవిగా కన్యకా పరమేశ్వరి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పాతనగరం కురుపాం మార్కెట్ సమీపంలో గల కన్యకాపరమేశ్వరి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మ సామూహిక విష్ణుకమల పూజ నిర్వహించారు. సాయంత్రం



ఆలయ ప్రాంగణంలో శ్రీసాయి భారతి కూచిపూడి అకాడమీచే నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. -డాబాగార్డెన్స్

న్యూస్‌రీల్

విశాఖ ఆర్డీవోగా శ్రీలేఖ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు మొక్క అందజేస్తున్న ఆర్డీవో శ్రీలేఖ

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)గా పి.శ్రీలేఖ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌ను అతని చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆమె జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నుంచి జిల్లాకు వచ్చారు. ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఆర్డీవోగా పని చేసిన డి.హుస్సేన్ సాహెబ్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

238 మంది రైతులకు స్టాళ్ల కేటాయింపు



జేసీ మయూర్ అశోక్ సమక్షంలో డ్రా తీస్తున్న అధికారులు

మహారాణిపేట: జిల్లాలోని రైతుబజార్‌ల్లో స్టాళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులను శనివారం డ్రా ద్వారా ఎంపిక చేశారు. 2019 నుంచి గత నెల 30వ తేదీ వరకు 673 మంది రైతులు స్టాళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ పి.మయూర్ అశోక్ సమక్షంలో డ్రా తీసి 238 మందికి స్టాళ్లు కేటాయించారు. సాయంత్రం రైతుబజార్‌ల్లో కూరగాయలు, నిమ్మకాయలు, పువ్వులు, కొబ్బరికాయలు, ఆకుకూరలు, కరివేపాకు విక్రయించేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజన రైతులు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని గ్రామీణ రైతులను ఎంపిక చేసినట్లు జేసీ వెల్లడించారు.

7, 8 తేదీల్లో 'నగర్‌నార్ స్టీల్‌ప్లాంట్' ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను ఎన్‌ఎండీసీకి చెందిన నగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌కు డిప్యూటేషన్‌పై పంపేందుకు ఈ నెల 7, 8 తేదీల్లో ఇక్కడే ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. గత సెప్టెంబర్‌లో మొదటి విడత ఇంటర్వ్యూలు నిర్వహించగా.. పెద్దగా స్పందన రాలేదు. ఆ రోజు ఇంటర్వ్యూలకు కేవలం 50 మంది ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రెండో విడత ఇంటర్వ్యూలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. 7న 98 పోస్టులకు, 8న 80 పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని స్టీల్‌ప్లాంట్ వర్గాలు వెల్లడించాయి.

బేవాచ్ పార్కు, విరాగో పబ్‌కు నోటీసుల జారీ

కొమ్మాది: తొట్లకొండ సమీపంలోని బేవాచ్ పార్కు రెస్టారెంట్ అండ్ బార్, తిమ్మాపురంలోని విరాగో పబ్‌లకు శనివారం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. బేవాచ్ పార్కు, విరాగోలు సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన విషయం తెలిసిందే. అలాగే జీవీఎంసీ అనుమతులు లేకుండా రెస్టారెంట్, బారు నడుపుతున్నట్లు కమిషనర్ నిర్ధారణకు వచ్చారు. ఈ నిర్మాణాలకు ప్లానింగ్ లేకపోవడంతో పలుమార్లు ఈ రిసార్టులకు నోటీసులు జారీ చేసినా.. వాటి యాజమాన్యం పట్టించుకోలేదు. దీంతో తుది నోటీసులు జారీ చేశారు. నిర్మాణ అనుమతులు, ఏపీసీజెడ్ఎంఏ అధికారుల నుంచి ఎన్‌వోసీ, యాజమాన్య పత్రాలు, పర్యావరణ, అటవీ శాఖకు సంబంధించి ఎన్‌వోసీ, అగ్నిమాపక విభాగం నుంచి ఎన్‌వోసీ తదితర ధ్రువీకరణపత్రాలను వారం రోజుల్లోగా తమకు సమర్పించాలని కమిషనర్ స్పష్టం చేశారు. లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు.


పీఎం కిసాన్ నిధుల విడుదల

జిల్లాలో 17,763 మందికి లబ్ధి

మహారాణిపేట: జిల్లాలోని రైతులకు ప్రధానమంత్రి కిసాన్ నిధులు శనివారం విడుదల చేశారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 17,763 మంది రైతులకు రూ.2 వేలు చొప్పున జమ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి తెలిపారు. భీమిలి, పద్మనాభం, గాజువాక, ఆనందపురం, పెందుర్తి, పెదగంట్యాడ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు.. రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించారు.

మత్తు వదిలిస్తాం

- విశాఖ మీదుగా మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా అడ్డుకట్టకు చర్యలు
- మత్తు పదార్థాలను గుర్తించేందుకు ఎన్‌సీబీ నుంచి 5 డ్రగ్ డిటెక్షన్ కిట్ల రాక
- తాజాగా పోలీస్ శాఖలో చేరిన మరో 8 కే9 జాగిలాలు
- సింథటిక్ డ్రగ్స్‌ను గుర్తించేందుకు సిబ్బందికి ఎన్‌సీబీ అధికారులతో శిక్షణ



విశాఖ సిటీ: 'మత్తు'వదిలించడానికి విశాఖ పోలీసులు అష్టదిగ్బంధనం చేస్తున్నారు. జిల్లా మీదుగా మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా చేసే వారిపై మెరుపు దాడులకు ప్రత్యేక దళాలు సిద్ధమవుతున్నాయి. ఒకవైపు మత్తు పదార్థాలను గుర్తించే వ్యవస్థను పటిష్టం చేస్తూనే.. మరోవైపు పెడ్లర్ల ఆటకట్టించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక దృష్టి సారించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి విశాఖ మీదుగా డ్రగ్స్ రవాణాకు పూర్తిగా చెక్ పెట్టేందుకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అధికారులతో సైతం కొంత మంది నగర పోలీసులకు శిక్షణ ఇప్పించారు.

ప్రతి స్టేషన్‌కూ డ్రగ్ డిటెక్షన్ కిట్

మత్తు పదార్థాలను నిర్ధారించేందుకు జిల్లాలో ప్రస్తుతం రెండు డ్రగ్ డిటెక్షన్ కిట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో డ్రగ్స్ నిర్ధారణ కొంత కష్టసాధ్యంగా మారింది. ఈ విషయాన్ని గ్రహించిన సీపీ న్యూఢిల్లీలోని ఎన్‌సీబీ అధికారులను సంప్రదించారు. నగర పోలీస్ అధికారులు, సిబ్బందికి మెళకువలతో పాటు డ్రగ్స్ గుర్తించే కిట్లను సమకూర్చాలని కోరారు. సీపీ విజ్ఞప్తి మేరకు ఎన్‌సీబీ ఐదు డ్రగ్ డిటెక్షన్ కిట్లను జిల్లాకు పంపించింది. దీంతో ఈ కిట్ల సంఖ్య ఏడుకు పెరిగింది. త్వరలోనే జిల్లాలోని 22 పోలీస్ స్టేషన్లకూ ఈ కిట్లను సమకూర్చేందుకు చర్యలు చేపట్టారు.

కొత్తగా 8 కే9 జాగిలాలు

మత్తు పదార్థాలను గుర్తించేందుకు విశాఖ పోలీసులు రెండు కే9 డాగ్ స్క్వాడ్లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు రైల్వేస్టేషన్, బస్టాండ్, పార్సిల్ కేంద్రాలు, ఇలా ప్రతి చోటా వీటి ద్వారానే డ్రగ్స్ గుర్తించే ప్రక్రియను చేపడుతున్నారు. కేవలం రెండు జాగిలాలు మాత్రమే అందుబాటులో ఉండడంతో ఏకకాలంలో తనిఖీలు కష్టసాధ్యంగా మారింది. విశాఖ మీదుగా విభిన్న మార్గాల్లో డ్రగ్స్ రవాణాను నియంత్రించాలంటే కే9 డాగ్ స్క్వాడ్‌లు మరిన్ని ఉండాలని సీపీ భావించారు. ఈ మేరకు సహకారం అందించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కోరారు. కలెక్టర్ వెంటనే సీఎస్సార్ నిధుల నుంచి 8 కే9 జాగిలాలను పోలీస్ శాఖకు సమకూర్చారు. ప్రస్తుతం వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

సింథటిక్ డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా

గంజాయి, మాదక ద్రవ్యాలతో పాటు సింథటిక్ డ్రగ్స్‌పై కూడా నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తరహా డ్రగ్స్‌ను గుర్తించడం కొంత కష్టసాధ్యం. సింథటిక్ డ్రగ్స్ పోర్టుల/ఫార్మా కంపెనీల నుంచి వచ్చే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశాఖ జిల్లాలో తగరపువలస, అనకాపల్లి జిల్లా పరవాడ, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో ఫార్మా కంపెనీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోర్టులు, ఫార్మా పరిశ్రమలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ డ్రగ్స్‌ను గుర్తించే విషయంపై ఎన్‌సీబీ అధికారులు నగర పోలీసులకు ప్రత్యేక మెలకువలు నేర్పించారు.

డ్రగ్స్ రవాణాపై నిఘా పెట్టాం



రైలు, బస్సు, జల, వాయు మార్గాల ద్వారా విశాఖ నుంచి మత్తు పదార్థాల రవాణా అడ్డుకోడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఎన్‌సీబీ అధికారులతో ప్రత్యేకంగా సిబ్బందికి శిక్షణ ఇప్పించాం. కొత్తగా డ్రగ్ డిటెక్షన్ కిట్లు, కే9 డాగ్ స్క్వాడ్‌లు అందుబాటులోకి వచ్చాయి. తనిఖీలను మరింత విస్తృతం చేస్తాం. గంజాయి ఎక్కువగా ఒడిశా నుంచే వస్తోంది. రవాణాదారులు, వినియోగదారులపైనే కాకుండా అసలు సూత్రధారులపై కూడా నిఘా పెడుతున్నాం.

–డాక్టర్ శంఖబ్రత బాగ్చి, పోలీస్ కమిషనర్

విశాఖ రూపురేఖలు మారేలా ప్రణాళిక

స్వర్ణాంధ్ర- 2047 విజన్ ప్లాన్‌పై కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్

మహారాణిపేట: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించనున్న స్వర్ణాంధ్ర- 2047 విజన్ ప్లాన్‌పై కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి చర్చ జరిగింది. జిల్లాలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాల సభ్యులు పలు అంశాలపై ఆచరణాత్మకమైన సలహాలు, సూచనలు అందజేశారు. 2047 నాటికి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సమ్మిళిత ఆర్థిక విధానాలకు పెద్దపీట వేయాలని, కొత్త ఆవిష్కరణలను స్వాగతించాలని, సాంకేతికతను మరింత పెంపొందించుకోవాలని అభిప్రాయపడ్డారు. రానున్న ఐదేళ్లలో విశాఖ రూపురేఖలు మారిపోయేలా వినూత్న ప్రాజెక్టులు చేపట్టాలని, విద్య, యువత ఉపాధికి కొత్త అవకాశాలు సృష్టించాలని, వ్యవసాయ రంగంలో ఆధునిక విధానాలను అవలంభించి ఉత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ ఉండాలని, ఆధునిక విధానాలు అనుసరించాలని సభ్యులంతా సలహాలు, సూచనలు చేశారు. జిల్లా ప్రణాళికను కలెక్టర్ హరేందిర ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎం.ఎస్.ఎం.ఈ. హబ్స్, టెక్నాలజీ సర్వీస్ హబ్‌లను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర జీఎస్‌డీపీలో జిల్లా వాటా 9.15 శాతం ఉందని అది 15 శాతానికి పెరిగేలా అందరూ సమష్టి కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, సీపీవో శ్రీనివాసరావు, క్రెడాయ్, ఫిక్కీ, ఆర్.ఐ.ఎన్.ఎల్., వి-సెజ్, బెల్ తదితర సంస్థల ప్రతినిధులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐకు వలపు వల.. కి'లేడి' అరెస్ట్

తగరపువలస: మురళీనగర్ ఎన్జీవోస్ కాలనీకి చెందిన యువతి ఇన్‌స్టా ద్వారా ఎన్‌ఆర్‌ఐ యువకుడితో పరిచయం పెంచుకుంది. ప్రేమిస్తున్నట్టు మాయమాటలు చెప్పి నిలువునా ముంచేసింది. ఆమె నుంచి తప్పించుకున్న యువకుడు భీమిలి పోలీసులను ఆశ్రయించాడు. శనివారం ఆమెను అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ.. షీలానగర్‌కు చెందిన ఓ కుటుంబం కొంతకాలంగా అమెరికాలో ఉంటోంది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వారి కుమారుడితో మురళీనగర్ ఎన్జీవోస్ కాలనీకి చెందిన కొరుప్రోలు జాయ్ జెమీమా పరిచయం పెంచుకుంది. బాధిత యువకుడి ద్వారా షీలానగర్‌లోని వారి చిరునామా తెలుసుకుంది. అతని తల్లిదండ్రులు షీలానగర్‌లో ఉన్నప్పుడు వారి ఇంటికి వెళ్లి కొన్ని రోజుల పాటు మంచి అమ్మాయిగా నటించింది. మీ అబ్బాయి స్నేహితురాలినని.. పెళ్లి చేసుకుంటానని అడగ్గా.. అతని తల్లిదండ్రులు నిరాకరించారు. ఆ తర్వాత కాలంలో అమెరికాలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్న బాధిత యువకుడిని మాయమాటలు చెప్పి విశాఖకు రప్పించింది. ఎయిర్‌పోర్టు నుంచే యువకుడిని మురళీనగర్‌లోని తన ఇంటికి తీసుకువెళ్లి బంధించింది. మత్తు పదార్థాలు కలిపిన జ్యూస్‌లు, డ్రింక్‌లు ఇచ్చి పెర్ఫ్యూమ్ స్ప్రే చేస్తూ మైకంలో ఉన్నప్పుడు దగ్గరగా ఉన్నట్లు ఫొటోలను తీయించింది. వాటితో ఆ యవకుడిని బ్లాక్‌మెయిల్ చేసింది. యువకుడు తన తల్లిదండ్రులకు చెప్పి పెళ్లికి ఒప్పిస్తానన్నా వినిపించుకోకుండా జెమీమా.. తన సహచరులతో కలిసి తరచూ బెదిరించేది. ఈ క్రమంలో ఇటీవల భీమిలిలోని ఒక హోటల్‌లో బలవంతంగా నిశ్చితార్థం చేసుకుని.. యువకుడితో రూ.5 లక్షల వరకు ఖర్చు చేయించింది. యువకుని ఫోన్ బ్లాక్ చేసి, నిశ్చితార్థం, వారు దగ్గరగా ఉన్న ఉన్న ఫొటోలు చూపించి.. మురళీనగర్‌లోని తన ఇంట్లో మళ్లీ నిర్బంధించింది. తనను పెళ్లి చేసుకోకపోతే ఈ ఫొటోలతో పోలీస్ కేసులు పెట్టించి.. అమెరికా వెళ్లకుండా చేస్తానని అతని వద్ద డబ్బులు కాజేసింది. ఆమె ఇంటి నుంచి అతను ఒకసారి పారిపోయేందుకు ప్రయత్నించగా సహచరులతో కలిసి కత్తితో చంపడానికి ప్రయత్నించింది. ఆమె సహచారులు కూడా జెమీమాను పెళ్లి చేసుకోకపోతే చంపేస్తామని బెదిరింపులకు దిగేవారు. ఎట్టకేలకు ఈ నెల 4వ తేదీన బాధిత యువకుడు ఆమె నుంచి తప్పించుకుని భీమిలి పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు మురళీనగర్‌లో జెమీమాను అదుపులోకి తీసుకుని.. ఆమె నుంచి ల్యాప్‌టాప్, ట్యాబ్, మూడు ఫోన్లు, కారు సీజ్ చేశారు. శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో కూడా జెమీమా, ఆమె స్నేహితులు ధనవంతుల అబ్బాయిలను ప్రేమ పేరుతో ట్రాప్ చేసి భారీగా డబ్బులు వసూలు చేసినట్టు బాధిత యువకుడు పోలీసులకు తెలిపాడు. జెమీమా స్నేహితులపై కూడా చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

అల్లిపురం: కాంట్రాక్టర్లు జీవీఎంసీకి సంబంధించిన అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించడంతోపాటు సకాలంలో పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ సమావేశ మందిరంలో శనివారం ఆయన ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ధరావత్తు సొమ్ము చెల్లింపులు, పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపు, ఇసుక కొనుగోలులో ఇబ్బందులు, సీఎఫ్ఎంఎస్ ద్వారా పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ గ్రాంట్ పనులు, పెండింగ్‌లో ఉన్న చెల్లింపులు తదితర సమస్యలను కాంట్రాక్టర్లు తెలపగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు. నగర పరిధిలో చేపట్టిన ఆయా పనులను సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యతలో రాజీ లేకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్ తాము చేపట్టిన పనులను మధ్యలోనే వదిలేసినా, నాణ్యతలో లోపం కనిపించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు చేపడుతున్న పనులను ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కాంట్రాక్ట్ బిల్లులను తక్షణమే సంబంధిత విభాగాలకు నివేదించాలని ఆదేశించారు. సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఫైనాన్స్ అడ్వయిజర్ మల్లికాంబ, ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్‌రాజు పలువురు పర్యవేక్షక ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 ఏడాదికి సంబంధించి డిగ్రీ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని, మిగిలిన కొద్దిపాటి సీట్లను మెరిట్ ఆర్డర్‌లో భర్తీ చేస్తామన్నారు. బీఏ పొలిటికల్ సైన్స్‌లో కన్వీనర్ కోటా 3, ఈడబ్ల్యూఎస్ 4, బీఏ హిస్టరీలో కన్వీనర్ కోటా 2, ఈడబ్ల్యూఎస్ 4, బీఏ ఎకనామిక్స్‌లో కన్వీనర్ కోటా 5, ఈడబ్ల్యూఎస్ 4, బీకాం జనరల్‌లో కన్వీనర్ కోటా ఒకటి, ఈడబ్ల్యూఎస్ 6, బీకాం కంప్యూటర్‌లో ఈడబ్ల్యూఎస్ 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాలను సంప్రదించాలని సూచించారు.

అదనంగా రూపాయి వసూలు.. రూ.పది వేలు జరిమానా

- కోర్టు ఖర్చులు కూడా ఇవ్వాలని మార్ట్‌కు ఆదేశం
- వినియోగదారుల మండలి తీర్పు

విశాఖ లీగల్: ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి అధికంగా వసూలు చేసిన మార్ట్‌కు వినియోగదారులు మండలి జరిమానా విధించింది. అలాగే కోర్టు ఖర్చులను ఇవ్వాలని సంచలన తీర్పు చెప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. మద్రిపాలెం ప్రాంతానికి చెందిన చదరఅప్పారావు అనే వ్యక్తి వేపగుంట దరి రిలయన్స్ మార్ట్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన సేవింగ్ క్రీమ్ కొనుగోలు చేశాడు. ఎమ్మార్పీ రూ.75 ఉండగా మార్ట్ సిబ్బంది రూ.76 వసూలు చేశారు. దీంతో అప్పారావు రూపాయి చెల్లించాలని మార్ట్ వారికి లెటర్ రాయగా అట్నుంచి ఎటువంటి స్పందన లభించలేదు. దీంతో ఆయన నగరంలోని వినియోగదారుల మండలి-1ని ఆశ్రయించాడు. కేసు విచారించిన వినియోగదారులు మండలి-1 అధ్యక్షురాలు డాక్టర్ తనూజ, సభ్యుడు కృష్ణమూర్తి మార్ట్ యాజమాన్యం ఎమ్మార్పీ కంటే ఒక రూపాయి అధికంగా తీసుకున్నందుకు రూ.10 వేలు జరిమానాతోపాటు కోర్టు ఖర్చులు రూ.2500 ఇవ్వాలని తీర్పు చెప్పారు.

అమరావతిలో గోల్ఫ్ కోర్స్

మంత్రి దుర్గేష్

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో పోటీల్లో రాణించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ క్లబ్(ఈపీజీసీ)లో జరుగుతున్న వైజాగ్ గోల్ఫ్-2024 పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మంత్రి విజేతలకు ట్రోఫీలందించారు. ఈ టోర్నీలో 126 మంది తొలిరౌండ్‌లో పోటీపడగా.. తుది రౌండ్ ఆడిన 57 మంది గోల్ఫర్లకు కోటి రూపాయల నగదు ప్రోత్సాహకాలను అందించారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఆటగాళ్లు తలపడేస్థాయిలో ఈపీజీసీ గుర్తింపు తెచ్చుకుందన్నారు. రాష్ట్రంలో విశాఖలో మినహా ఈ తరహా గోల్ఫ్ కోర్స్ లేదని.. అమరావతితో పాటు పలు నగరాల్లో గోల్ఫ్ కోర్సులు ఏర్పాటు చేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా(పీజీటీఐ) ఆధ్వర్యంలో వరసగా ఇది రెండో ఎడిషన్ అని సంస్థ సీఈవో ఉత్తమసింగ్ అన్నారు. అంతర్జాతీయ టోర్నీలు నిర్వహించే స్థాయికి ఆధునీకరించిన విశాఖ గోల్ఫ్ కోర్స్ ఎదిగిందని ఈపీజీసీ కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు తెలిపారు.

మహిళా కానిస్టేబుళ్లకు సీపీ అభినందన

అల్లిపురం: ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్–2024 యోగా ఈవెంట్‌లో కాంస్య పతకాలు సాధించిన నగర పోలీస్ టీమ్‌ను సీపీ శంఖబ్రత బాగ్చి అభినందించారు. ఛత్తీస్‌గఢ్‌లో గత నెలలో మొట్టమొదటి ఆల్ ఇండియా రెజ్లింగ్ క్లస్టర్–2024 పోటీలు జరిగాయి. యోగా ఈవెంట్‌లో మహిళా కానిస్టేబుళ్లు టి.చిన్నారి(మల్కాపురం), ఎన్.భవాని(ద్వారకా క్రైం), ఎ.మల్లేశ్వరి(కంచరపాలెం) ప్రతిభ చూపి కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు శనివారం నగర పోలీస్ కమిషనర్‌ను అతని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ వారిని అభినందించి.. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విజయవాడ–శ్రీకాకుళం రోడ్ మధ్య స్పెషల్స్

తాటిచెట్లపాలెం: పండగల వేళ రద్దీ దృష్ట్యా విజయవాడ–శ్రీకాకుళం రోడ్–విజయవాడ మధ్య ఆయా తేదీల్లో స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విజయవాడ–శ్రీకాకుళం రోడ్(07215) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6,7,8 తేదీల్లో రాత్రి 8 గంటలకు విజయవాడలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.30 గంటలకు బయల్దేరి ఉదయం 5.30 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్–విజయవాడ(07216) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7,8,9వ తేదీల్లో ఉదయం 6.30 గంటలకు బయల్దేరి అదేరోజు ఉదయం 9.30 గంటలకు దువ్వాడకు, సాయంత్రం 4గంటలకు విజయవాడ చేరుకుంటుంది.

కదం తొక్కిన ఉక్కు కార్మికులు

- హెచ్‌ఆర్‌ఏ, కరెంట్ చార్జీలపై నిరసన
- సొమ్మసిల్లిన కార్మికురాలు.. ఆస్పత్రికి తరలింపు


స్టీల్‌ప్లాంట్ ఈడీ బిల్డింగ్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: ఉక్కు యాజమాన్యం తొలగించిన హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని, కరెంటు చార్జీలను తగ్గించాలన్న డిమాండ్లపై స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు శనివారం ఉద్యమించారు. ఉదయం ప్రారంభమైన ఆందోళన రాత్రి వరకు కొనసాగింది. డిమాండ్లపై యువ కార్మికులు ఉదయం ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌కు చేరుకోగా అక్కడకు వచ్చిన కార్మిక సంఘాల నాయకులను నిలదీశారు. కార్మిక నాయకుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని నిందించారు. తమతో ఉండాలంటే ఉండండి, లేదంటే తామే పోరాడుతామని తేల్చి చెప్పారు. ముఖ్యంగా మహిళా కార్మికులు మధ్యాహ్నం భోజనం కూడా లేకుండా సాయంత్రం వరకు కదలకుండా ఆందోళనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 'ఎ' షిఫ్ట్ వదిలిన తర్వాత మరింతమంది కార్మికులు బిల్డింగ్ వద్దకు చేరి పెద్ద ఎత్తున ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతన సవరణ జరగకపోవడంతో పాటు ఒక్కొక్క సదుపాయం కోల్పోతుండటం వల్ల పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఇప్పుడు హెచ్‌ఆర్‌ఏ కూడా తొలగిస్తే తమ పరిస్థితి ఏంటని నిలదీశారు. ఈ విషయంతో తాడో పేడో తేల్చుకుంటామన్నారు. సాయంత్రం హెచ్‌ఆర్ జీఎం ఎం.మధుసూదనరావు నచ్చచెప్పడానికి ప్రయత్నించగా కార్మికులు అంగీకరించలేదు. ఉదయం నుంచి ఆందోళన చేస్తున్న ఇన్‌స్ట్రుమెంటేషన్ యువ కార్మికురాలు ప్రతిమ సొమ్మసిల్లి పోయింది. పోలీసులు ఆమెను ఉక్కు ఆసుపత్రికి తరలించారు. కార్మికుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది పెద్ద ఎత్తున మోహరించారు. కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, గణపతిరెడ్డి, కర్రి దాలినాయుడు, ఎల్లేటి శ్రీనివాస్, నమ్మి సింహాద్రి, పల్లా పెంటారావు, డి.వి.రమణారెడ్డి, బి.డేవిడ్ ఆందోళనలో పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలో తోపులాట.. ఒకరి మృతి

ఒకే కుటుంబంలో.. ఒకే రోజు రెండు విషాదాలు


వాసు మృతదేహం

మల్కాపురం: అప్పటికే ఆ కుటుంబంలో ఒకరు చనిపోయి విషాదం నెలకొంది. ఈ క్రమంలో జరిగిన ఆస్తి తగాదాలో తోపులాట జరిగి ఇంకొకరు మృతి చెందడంతో కలకలం రేగింది. పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన ఈ ఘటనతో ఒకే రోజు ఆ కుటుంబంలో రెండు విషాదాలు చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మల్కాపురం శెట్టిబలిజ వీధిలో సరిపల్లి వాసు(47) తన భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నారు. అతనికి సోదరులు సింహాచలం, గోపి, సోదరి వరలక్ష్మి ఉన్నారు. సింహాచలం మొదటి భార్య కొడుకు సరిపల్లి పవన్ సాయి తన కుటుంబంతో దొండపర్తిలో నివసిస్తున్నాడు. అతను మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలో వరలక్ష్మికి మూడు అంతస్తుల భవనం ఉంది. ఆమెకు కుమారుడు ప్రసాదరావు, కుమార్తె దేవి ఉన్నారు. దేవీని తన సోదరుడైన గోపికిచ్చి వరలక్ష్మి వివాహం చేసింది. మూడు అంతస్తుల భవనంలో కింద ఇంట్లో దేవి కుటుంబం నివాసం ఉంటోంది. కాగా.. శుక్రవారం వరలక్ష్మి మృతి చెందింది. ఆమె దహన సంస్కారాలు అనంతరం రాత్రి కుటుంబ సభ్యులంతా కూర్చొని మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో వరలక్ష్మి ఇంటి పంపక విషయం చర్చకు వచ్చింది. ప్రసాదరావు తన సోదరి అయిన దేవికి కింద ఇల్లు ఇవ్వనని వాదించాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ మొదలైంది. గోపి, ప్రసాదరావు ఒకరినొకరు నెట్టుకున్నారు. దీంతో వాసు కలుగజేసుకుని ఇరువురిని చెదరగొట్టారు. ఇలా వాదన జరుగుతుండగా దేవి వరసకు సోదరుడైన పవన్ సాయికి ఫోన్ చేసి తన భర్తపై దాడి చేస్తున్నారని తెలిపింది. దీంతో పవన్ తన కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులను తీసుకుని వెంకన్నపాలెం వచ్చాడు. ప్రసాదరావుపై దాడికి యత్నించాడు. వీరిని అడ్డుకునేందుకు వాసు అక్కడకు వెళ్లాడు. ఈ క్రమంలో పవన్ వాసుపై పిడిగుద్దులు గుద్ది, బలంగా తోసేశాడు. దీంతో వాసు తల బలంగా నేలకు తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనపై వాసు భార్య మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. సీఐ విద్యాసాగర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు పవన్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబర్‌లో సీపీఎం జిల్లా మహాసభలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

దాబాగార్డెన్స్: పెందుర్తి వేదికగా డిసెంబర్ 28, 29 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సీపీఎం విశాఖ జిల్లా 24వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ప్రజాపోరాటాల నిర్వహణకు ఆర్థికంగా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.జగన్, పెందుర్తి, గోపాలపట్నం జోన్ కార్యదర్శులు బి.రమణి, బి.వెంకటరావులతో కలసి శనివారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారానికి జరిగే పోరాటాలు, మహా సభల విజయవంతానికి ప్రజలంతా విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు.

మరికొంతకాలం స్పెషల్ రైలు



తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో న్యూటిన్‌సుకియా–ఎస్ఎంవీ బెంగళూరు వీక్లీ స్పెషల్ రైలును మరికొంతకాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. న్యూటిన్‌సుకియా–ఎస్ఎంవీ బెంగళూరు(05952) స్పెషల్ గురువారం సాయంత్రం 6.45 గంటలకు న్యూటిన్‌సుకియాలో బయలుదేరి.. శనివారం మధ్యాహ్నం 3.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఆదివారం ఉదయం 9 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది. ఎస్ఎంవీ బెంగళూరు–న్యూటిన్‌సుకియా (05951) స్పెషల్ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత(సోమవారం) 12.30 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 9.15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి రాత్రి 9.20 గంటలకు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు న్యూటిన్‌సుకియా వెళ్తుంది.

రెక్కీ నిర్వహించి..ఆపై చోరీలు

- రాష్ట్ర వ్యాప్తంగా 50 ఆలయాల్లో దొంగతనాలు
- నిందితులు శ్రీకాకుళానికి చెందిన వారు
- ఆగస్టులో మాధవస్వామి ఆలయంలో చోరీ
- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన ఘరానా దొంగలు


సవర శీపన్య శ్రీనివాసరావు బత్తిని శ్రీకాంత్

మద్రిపాలెం: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాలే వారి టార్గెట్. హుండీ చోరీల్లో నంబర్ వన్ కేటుగాళ్లు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని మరీ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. జీపీఎస్ ఆధారంగా ఆలయాలను గుర్తించి..ముందురోజు రెక్కీ నిర్వహించి.. ఆపై హుండీలో ఆదాయం, బంగారు ఆభరణాలు చోరీ చేయడంలో వీరు స్పెషలిస్టులు. దొంగతనం చేసిన వాడు దొరకకమానడు అన్నట్టు విశాఖ పోలీసులకు చిక్కారు. కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్‌లో క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు, క్రైం ఏడీసీపీ ఎం.మోహనరావు వివరాల మేరకు...మాధవధార మాధవస్వామి ఆలయంలో ఆగస్టులో చోరీ జరిగింది. హుండీలో నగదు, బంగారు ఆభరణాలు దోచుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి పాల్పడింది శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం ఎల్ఎన్‌పేటకు చెందిన వారిగా గుర్తించారు. కంచరపాలెం క్రైం సీఐ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం పోలీసుల సాయంతో ఎల్ఎన్‌పేట వెళ్లి విచారణ జరిపారు. దీంతో నిందితులు సవర బోగేష్, సవర శీపన్య, కూర్మాణ శ్రీనివాసరావు, అలాగే తెలంగాణ రాష్ట్రానికి చెందిన బత్తిని శ్రీకాంత్‌లను గుర్తించి వారి నుంచి 30 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి స్వాధీనం చేసుకున్నారు. వీరిని అక్కడే అరెస్టు చూపించి రిమాండ్‌కు తరలించినట్టు క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 ఆలయాల్లో వీరు చోరీకి పాల్పడ్డారన్నారు. ఈ సమావేశంలో సీఐ నిమ్మకాయల శ్రీనివాస్, ఎస్ఐ సుదర్శన్ పాల్గొన్నారు.

అవే పనులకు మరోసారి శంకుస్థాపన

ఎమ్మెల్యే గంటా తీరుపై విమర్శలు


నాడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ముత్తంశెట్టి


నేడు అదే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైంది. ఒక్క సూపర్ సిక్స్ పథకమూ అమలు కాలేదు. పోనీ స్థానికంగా ఏమైనా పనులు చేపట్టారా? అంటే అదీ లేదు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగ్గా.. అవే పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేసి ఫొటో షూట్లు చేసుకుంటున్నారు. ఈ విషయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముందంజలో ఉన్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి 4న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు, నగరపాలెం, కాపుల దిబ్బడపాలెం ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు రూ. 57.70 లక్షలతో నాటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శ్రీకారం చుట్టారు. అయితే కాంట్రాక్టర్ లేక పోవడం, తర్వాత ఎన్నికలు సమీపించడం, కోడ్ అమల్లోకి రావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అయితే మళ్లీ అవే అభివృద్ధి పనులకు శిలాఫలకాలు మార్చి శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఒకే పనులకు రెండోసారి శంకుస్థాపన చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. శంకుస్థాపనలో ఫొటో షూట్లతో హడావిడి చేసిన గంటా.. ఇదేందంటా? అంటూ ప్రజలు నవ్వుకున్నారు.

జూ క్యాంటీన్‌లో ధరల దరువు

వాటర్ బాటిల్ రూ.30.. చిన్న సమోసా రూ.20

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కు క్యాంటీన్‌లో ధరలు సందర్శకులకు చుక్కలు చూపుతున్నాయి. బయట కంటే ఇక్కడ రెట్టింపు ధరలు ఉండటం భారమవుతోంది. ఈ ఏడాది వేలంలో క్యాంటీన్‌ను సొంతం చేసుకున్న సదరన్ ఫుడ్స్ నిర్వాహకులు.. అన్ని వస్తువుల ధరలను అమాంతంగా పెంచేయడంతో సందర్శకులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. బయట రూ.20కి లభించే లీటర్ వాటర్ బాటిల్‌ను ఇక్కడ రూ.30కి అమ్ముతున్నారు. సమోసా చిన్న సైజు రూ.20, చిన్న కప్పుతో పాప్‌కార్న్ రూ.30, చిన్న ప్లేట్‌లో ఫ్రెంచ్ ఫ్రైస్ రూ.90, కాఫీ రూ.30, టీ రూ.20కు విక్రయిస్తున్నారు. బిర్యానీ ధరలు రూ.170 నుంచి 250 వరకు ఉన్నాయి. పెరుగు అన్నం తిందామనుకున్నా రూ.110 చెల్లించాల్సిందే.. ఇలా అన్ని ధరలు భారీగా పెంచేశారని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జూలో రూ.10కి టీ, రూ.20కు లీటర్ వాటర్ బాటిల్, రూ.10కి సమోసా, రూ.60కే ఫ్రైడ్ రైస్, విజిటబుల్ బిర్యానీ లభించేవని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా.. జూ అధికారులు పట్టించుకోవడం లేదని, ధరలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శాంతి ఆశ్రమ పిటిషన్‌ను అనుమతించిన కోర్టు

విశాఖ లీగల్: వివాదాస్పదమైన శ్రీ శాంతి ఆశ్రమం కేసులో భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రత్యేక పిటిషన్‌ను అనుమతించింది. ఇందులో ప్రతి వాదులుగా పేర్కొన్న వ్యక్తుల మధ్య లావాదేవీలను పేర్కొంటూ.. తమ అభిప్రాయాలను సమర్పించాలని న్యాయస్థానం తగిన సమయాన్ని కేటాయించింది. అయితే ప్రతి వాదులుగా పేర్కొన్న వివేకానంద వారసులు ఎటువంటి పిటిషన్ దాఖలు చేయలేదు. వారి న్యాయవాదులు న్యాయస్థానాన్ని కొంత సమయం కేటాయించాలని కోరినా అందుకు న్యాయస్థానం సున్నితంగా తోసి పుచ్చింది. ప్రతివాదులు తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేయాలని న్యాయస్థానం కోరినా వారు స్పందించలేదు. దీంతో శాంతి ఆశ్రమం తరఫున దాఖలైన మధ్యంతర పిటిషన్‌కు న్యాయస్థానం అనుమతించింది.

నేడు పోరాట కమిటీతో పవన్ కల్యాణ్ భేటీ

ఉక్కునగరం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదివారం మంగళగిరిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులతో భేటీ కానున్నారు. స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మంగళగిరి జనసేన కార్యాలయం ఎదుట ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అక్కడ జనసేన నాయకులను కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితులను వివరించారు. ఈ నేపథ్యంలో తమను కలిసేందుకు పవన్ కల్యాణ్ అంగీకరించినట్లు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

తీరంలో కోస్ట్‌గార్డ్ ఆఫ్‌షోర్ పెట్రోలింగ్

సింథియా: షిప్‌యార్డ్ మరో మైలు రాయిని దాటింది. రెండున్నరేళ్లుగా షిప్‌యార్డులో నిర్మాణంలో ఉన్న కోస్ట్‌గార్డ్ ఆఫ్‌షోర్ పెట్రోలింగ్ వెసెల్‌ను నిర్ణీత గడువు ఏడురోజులకు ముందే పూర్తి చేసి రికార్డు సృష్టించింది. అనుభవజ్ఞులైన బృందం కోస్ట్‌గార్డ్ ఆఫ్‌షోర్ పెట్రోలింగ్ వెసెల్ తయారీలో భాగస్వామ్యులయ్యారు. శనివారం సముద్రంలో వెసెల్ పెట్రోలింగ్ నిర్వహించింది. తూర్పు తీరంలో సముద్ర ప్రయోజనాలకు మద్దతుగా ఈ వెసెల్‌ను షిప్‌యార్డ్ అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మించింది.